







ప్లాస్టిక్ గలగల.. నగరం విలవిల..!

ఒంగోలుపై ప్లాస్టిక్ పంజా విసురుతోంది. నగరంలో ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్లే వాడుతున్నారు. రోడ్డు పక్కన తోపుడు బండ్ల మొదలు.. పెద్దపెద్ద హోటళ్లు, కర్రీస్ పాయింట్లు, కిరాణా షాపులు, పండ్ల వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడుతూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. ప్రజలు సైతం ప్లాస్టిక్ భూతంతో చెలగాటమాడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ దెబ్బకు ఒంగోలు నగరం విలవిల్లాడుతోంది.

– సాక్షి, ఒంగోలు








క్లుప్తంగా

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించరాదు

నాగులుప్పలపాడు: దీపావళి పండుగ సందర్భంగా అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా బాణసంచా విక్రయించాలంటే తగు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు సూచించిన ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు.

రీ సర్వేపై గ్రామ సభలు

కొత్తపట్నం: భూ సమస్యలు పరిష్కరించేందుకు రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. ఇప్పటికే పాదర్తి రెవెన్యూ పరిధిలో గ్రామ సభ నిర్వహించామని, ఈ నెల 29న పాయకారి కంప్రిక, నవంబర్ 1న రాజుపాలెం, 5న మడనూరు, 8న ఈతముక్కల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. భూముల హెచ్చుతగ్గులు, మ్యుటేషన్, పేర్లలో తప్పులు, రికార్డులో లేకుండా ఉన్నవారిని రికార్డులో ఎక్కించడం, ఆన్‌లైన్ సమస్యలు కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కనపర్తి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సుల్తాన్‌బాషా తెలిపారు. కందుకూరులో జరిగిన జిల్లా అథ్లెటిక్ పోటీల్లో పాఠశాలకు చెందిన వాసవి బాలికల అండర్–17 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో గెలుపొందగా, బాలుర అండర్–17 పోటీల్లో హైజంప్‌లో మరో విద్యార్థి గెలుపొంది శ్రీకాకుళంలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సంతనూతలపాడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు సూచించారు. బ్యాంక్ ప్రతినిధులమని, లోన్ ఇస్తామని ఫోన్లు చేసి వ్యక్తిగత సమాచారం అడిగినా.. అకౌంటు నంబర్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ వివరాలు అడిగినా.. ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదని సూచించారు. ఎవరైనా సైబర్ బాధితులు ఉంటే 1930 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

టీడీపీ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదు

బేస్తవారిపేట: టీడీపీ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదని జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కేటాయించలేదు, అయినా పొత్తు ధర్మాన్ని పాటించామని, టీడీపీ కోసం పనిచేశామన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించే స్థాయికి కొందరు టీడీపీ నాయకులు ఎదిగారన్నారు. ఇతర పార్టీ నాయకులను చేర్చుకునేటప్పుడు టీడీపీ నాయకులను సంప్రదించాలనే ఇంగిత జ్ఞానం లేదా అని పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించడంపై ధ్వజమెత్తారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి రావడం జీర్ణించుకోలేక బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని, ఆయన తప్పు చేసి ఉంటే అధికారం ఉపయోగించి శిక్షించాలి కానీ దిగజారిన మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దగ్గరుండి జనసేనపై విమర్శలు చేయించడం తగదని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు.

శ్రీగిరిలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు, భక్తులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రముఖ వేద ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో లోక కల్యాణాన్ని, విశ్వ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించిన ఈ సుదర్శన హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి సువర్ణ అష్టాదశ పద్మ పాదార్చన కార్యక్రమం నిర్వహించారు. శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత, వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వెంకట రమణారావు 71వ జయంతి సందర్భంగా శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాసచరణ్‌రాజీవ్, ఆలూరు జై శంకర్, ఆలయ ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, పలు రంగాల ప్రముఖులు పాల్గొని రమణారావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాలకు ఆలూరు వెంకట రమణారావు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

● బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ 30 శాతం ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు కోరారు. ఆదివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఒంగోలు డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించగా, వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తెన జాలరామయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మెరిట్ కం రోస్టర్ విధానం అమలు చేయాలని, తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని అన్నారు. గవర్నమెంట్ జిల్లా పరిషత్తులలో అమలు చేస్తున్న విధానాన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూరు మాధవరావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగన్నాథం,



సమావేశంలో మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు

ప్రసాదరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు మిరియాల వెలుకొండయ్య, జిల్లా కోశాధికారి జి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు డివిజన్, నగర నూతన కమిటీల ఎన్నిక...

ఒంగోలు డివిజన్ నూతన కమిటీ గౌరవాధ్యక్షునిగా మిర్యాల వెలుకొండయ్య, అధ్యక్షునిగా పల్లె తిరుపతిస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొల్లపోతు ప్రభాకర్, ఒంగోలు నగరశాఖ గౌరవాధ్యక్షునిగా లేలపల్లి కృపాజయం, అధ్యక్షునిగా పావళ్ల రాచయ్య, ప్రధాన కార్యదర్శిగా నూకతోటి కుమార్‌స్వామి, ట్రెజరర్‌గా మిరియాల విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నా ఎదుగుదలకు ఒంగోలే దిక్సూచి

● ఆత్మీయ సమావేశంలో లంకా దినకర్

ఒంగోలు అర్బన్: నా ఎదుగుదలకు ఒంగోలు దిక్సూచి లాంటిదని ఏపీ 20 సూత్రాల పథకం అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఏ–1 ఫంక్షన్ హాలులో లంకా దినకర్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా ఎంపికైన దినకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లాను అభివృద్ధి చేయడంలో తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. తనకు సంబంధించిన శాఖ పని ఒంగోలు నుంచే ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యనిర్వాహక కార్యదర్శి నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుడి పై పడిన విద్యుత్ తీగలు

కంభం: స్థానిక కందులాపురం కూడలిలో హైవేకి ఓ వైపు 11 కేవీ విద్యుత్ స్తంభాలకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీగలు తెగి పడి అక్కడ ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తెగిపడిన తీగలు హైవేని ఆనుకొని ఉన్న ఆలయంపై పడటంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. సుమారు మూడు గంటల సేపు విద్యుత్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

పొదిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సాయి రాజేశ్వరరావు పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలను నడిపటం చట్టరీత్యా నేరమని చెప్పారు. వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. రోడ్డు నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఎస్సై వేమన పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ఏకాదశి పూజలు



వెంకటేశ్వరస్వామి పాదాలు తాకిన భానుడి కిరణాలు



పొలిమేర అభయాంజనేయస్వామి పాదాలు తాకిన సూర్యుడి కిరణాలు

ఒంగోలు మెట్రో: నగరంలోని వైష్ణవాలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు నిర్వహించారు. సమతానగర్లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో, రంగారాయుడు చెరువు దగ్గర శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన పూజాక్రతువులను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. కర్పూర హారతితో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకటేశ్వరస్వామి పాదాలు తాకిన భానుడి కిరణాలు...

ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర, మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర పొలిమేర అభయాంజనేయస్వామి, శ్రీదేవి భూదేవి కళ్యాణ వెంకటేశ్వరస్వామి పాదాలను ఆదివారం ఉదయం సూర్యుని కిరణాలు తాకి అభిషేకధారలా ప్రసరించాయి.

ఏకాగ్రతను పెంచే పుస్తక పఠనం

ఒంగోలు టౌన్: పుస్తక పఠనంతో ఏకాగ్రత, చదువుపై ఆసక్తి పెరుగుతుందని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకాలను చదవడం గురించి కథలు, కవితల ద్వారా వినిపించారు. పిల్లలకు మోటివేషన్ కథలను చెప్పారు. పిల్లల చేత కథల పుస్తకాలను చదివించి కథలను చెప్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెదడు పనితీరును పుస్తక పఠనం మెరుగు పరుస్తుందని అనేక నివేదికలు తేల్చిచెప్పాయన్నారు. చిన్నపిల్లలు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాలాది మోహన్, షిరిడీ సాయిరాం, లింగిశెట్టి అశోక్ కుమార్, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, ఇమ్మానుయేలు పాల్గొన్నారు.



చదవడం మాకిష్టం కార్యక్రమంలో చిన్నారులు

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

కంభం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు, పాత్రికేయులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు, పట్టణంలో పలువురు యువకులు 130 మంది వరకు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పోలీసులు పండ్లు, జ్యూస్ అందజేశారు.

శాస్త్రీయ విజ్ఞానంతో సామాజికాభివృద్ధి




విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ జవహర్, జయ

చీమకుర్తి: సామాజికాభివృద్ధి శాస్త్రీయ విజ్ఞానంతోనే సాధ్యమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ అన్నారు. ఆదివారం చీమకుర్తిలోని సీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ కార్యక్రమానికి గురుకుల పాఠశాలల కన్వీనర్‌తో కలిసి జవహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మూఢ నమ్మకాలను పారదోలుతూ సృజనాత్మకతతో కూడిన విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగు దశలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా చీమకుర్తిలో ఆదివారం సీపీఎస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 60 బృందాలు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో దర్శి మండలం చందలూరు జిల్లాపరిషత్ హైస్కూలు, పీసీ పల్లి జిల్లా పరిషత్ హైస్కూలు, గిద్దలూరు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో చీమకుర్తికి చెందిన సీపీఎస్ పాఠశాల, వెలిగండ్ల నుంచి కేవీఎస్ఎల్ హైస్కూలు, ఉప్పుగుండూరు నుంచి ఆక్స్‌ఫర్డ్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాలలో విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు వచ్చే నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, బీ ఆంజనేయులు, లయన్స్‌క్లబ్, గెలాక్సీ క్లబ్ అధ్యక్షుడు కొండవీటి ఏడుకొండలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో దుర్గంధం

ఒంగోలు అర్బన్:

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలో నీళ్లు నిలవడంతో పాటు కాలువల్లో మురుగు ముందుకు కదలక దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు ఆగిపోయి వారం దాటినా నగరపాలక సంస్థ అధికారులు డ్రైనేజీలు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలపై దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాలువల్లో, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడంతో దోమలు పెరిగి స్థానికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి. ఒకవైపు దుర్వాసన వెదజల్లుతుంటే.. మరోవైపు దోమల బెడద పెరిగి అనారోగ్యం పాలవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో గృహాల మధ్య కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు ప్రవహించకుండా నిల్వ ఉంటోంది. కనీసం కాలువల్లో పూడిక తీయడం, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం వంటివి కూడా లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చీకటిపడితే ఇళ్ల నుంచి బయటకు వచ్చి కాసేపు నిలబడినా దోమలు పీక్కుతింటున్నాయని వాపోతున్నారు. ఇళ్ల డోర్లు, కిటికీలకు దోమల నెట్‌లు లేకపోతే ఇళ్లలో కూడా ఉండే పరిస్థితులు లేవంటే.. దోమల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. దోమలు పెరగడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యం పాలవుతూ ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడిక తీసి మురుగునీరు పారేలా చూడాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




హౌసింగ్ బోర్డు కాలనీలో మురుగునీరు ప్రవహించకుండా నిలిచిపోయిన కాలువలు